క్లుప్తంగా

లేగదూడల అందాల పోటీలు

దెందులూరు: మండలంలోని కొత్తగూడెం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ (తాడేపల్లిగూడెం) ఆధ్వర్యంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. దీనికి అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనకు వివిధ మండలాల నుంచి 40 లేగదూడలు వచ్చాయని దెందులూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి


రామయ్య (ఫైల్)

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామానికి చెందిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కానూరి రామయ్య (45) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. రామయ్య మృతదేహాన్ని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, వీఆర్‌ఓలు కిషోర్, రామకృష్ణ, వీఆర్‌ఏలు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. రజక సంఘం నాయకులు చిలకలపల్లి కట్లయ్య, గుళ్లపూడి వెంకటేశ్వరరావు, గోవాడ చంటి పరామర్శించారు.

ఆహారం తయారీలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

పెదవేగి : విద్యార్థులకు వడ్డించే ఆహారం తయారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని గార్లమడుగు సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు అన్నారు. పెదవేగి మండలం గార్లమడుగు ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు అందిస్తోన్న భోజనాన్ని సర్పంచ్ గురువారం పరిశీలించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

ఉంగుటూరు: అహింస, శాంతి ద్వారా సమ సమాజ స్థాపన సాధ్యమని, అందుకే ఏసుక్రీస్తు చూపిన మార్గం అందరికీ అనసరణీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం చేబ్రోలు బేతేలు ప్రార్థన మందిర ఏడో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం కావాలి

దెందులూరు: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కావ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడారు.

యాజమాన్య పద్ధతులతోనే చీడపీడల నివారణ


డ్రోన్‌తో మందుల పిచికారీ విధానాన్ని వివరిస్తున్న దృశ్యం

భీమడోలు: వరిలో చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ సూచించారు. భీమడోలులో ఏడీఏ ఎస్పీవీ ఉషారాజకుమారి ఆధ్వర్యంలో గురువారం పొలంబడి, ఆదామా కంపెనీకి చెందిన డ్రోన్‌తో వరి చేల్లో డెమో కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ ఎస్పీవీ ఉషారాణి, వ్యవసాయ క్షేత్ర సహాయకులతో కలిసి ఫణికుమార్ 250 ఏకరాల విస్తీర్ణంలోని వరి చేలను పరిశీలించారు. కాండం తొలుచు పురుగు, ఆకు ముడత, మాగుడు తెగుళ్లు, దోమ ఉన్నట్టు గుర్తించారు. వీటి నివారణ పద్ధతులను వివరించారు. వేసవిలో అపరాల సాగుతో నేల సారమవుతుందన్నారు. ఈనెల 29వ తేదీ మార్టేరులో జరిగే కిసాన్‌మేళాకు రైతులు తరలి వెళ్లాలన్నారు. రైతులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. క్లస్టర్ మోటరింగ్ అధికారి, ఏడీఏ సుబ్బారావు, ఏడీఏ ఉషారాజకుమారి మాట్లాడారు.

ఎ.గోకవరంలో మలేరియా కేసు

ఉంగుటూరు: ఎ.గోకవరం గ్రామానికి చెందిన నెర్సు నాగరాజ అనే వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం గోదైలు కూడా వెళ్లినప్పుడు జ్వరం వచ్చింది. అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయగా మలేరియా అని నిర్ధారించారు. దీంతో చేబ్రోలు వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. డాక్టర్ వర్మ ఆధ్వర్యంలో ఎ.గోకవరం గ్రామంలో గురువారం సబ్ యూనిట్ మలేరియా అధికారి లక్ష్మణరావు పర్యవేక్షణలో కీటక నియంత్రణ మందు డ్రెయిన్‌లో పిచికారీ చేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకులు వీవీ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పి.శ్రీనివాసు, ఆరోగ్య కార్యకర్త సరోజిని పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మృతి

దెందులూరు: దెందులూరుకు చెందిన గొటికల అడ్వర్డ్ పాతామియో కుమారుడు సామ్యూల్ మృతి చెందాడు. సామ్యూల్ పెదవేగి మండలం సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో నర్సింగ్ చదువుతున్నాడు. ఈ నెల 28న రైలులో వెళ్తూ ఒంగోలు సమీపంలో పడిపోయి మృతి చెందాడని పోలీసులు సామ్యూల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం సాయంత్రం దెందులూరు తీసుకువచ్చారు. సామ్యూల్‌కు తల్లి, ఇద్దరు చెల్లెలున్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం తోడ్పాటు

నాటు కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


రామారావుగూడెంలో పెంచుతున్న నాటుకోళ్లు

దెందులూరు: స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు నిరతరం ఆదాయం, స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోంది. దెందులూరు నియోజకవర్గంలో అదనపు ఆదాయం, స్వయం ఉపాధి లక్ష్యంగా మహిళలు నాటు కోళ్ళు, కౌజు పిట్టల డెయిరీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్క స్వయం సహాయక సంఘానికి రూ.20 లక్షలు నేరుగా వారి ఖాతాలకు జమ చేయడంతో నాటుకోళ్లను పెంచుతున్నారు. ఈ కోళ్లు మూడు నెలల్లోపే తయారవుతాయి. ఈ కోడి మాంసం ప్రొటీన్ ఆహారం కావడంతో గుడ్డుకి, మాంసానికి అధిక డిమాండ్ ఉంది. ఈ కోడి గుడ్డుకు రూ.10 నుంచి రూ.20 ధర ఉంది. నియోజకవర్గంలో మండలాల వారీగా దెందులూరులో 100, పెదపాడులో 126, పెదవేగిలో 100, ఏలూరు రూరల్‌లో 100 యూనిట్లు ఉన్నాయి.

డిమాండ్ అధికం



గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్లు, గుడ్లకు అధికంగా డిమాండ్ ఉంది. ఈ కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం రావడం సంతోషంగా ఉంది. తాను ఆదాయం సంపాదిస్తున్నానే సంతృప్తి పొందుతున్నాను.
– ఎస్.వెంకటలక్ష్మి, లబ్ధిదారురాలు, చల్లచింతలపూడి

రుణాల మంజూరు



గ్రూపుల సమావేశంలో తీర్మానం ఆమోదించడం, ఏపీఎంకు తెలియచేయడం, రుణాలు మంజూరు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. గ్రూపు సభ్యులకున్న ఆసక్తికి తోడుగా ప్రభుత్వం రుణాలను సైతం సకాలంలో వేగవంతంగా అందిస్తున్నారు. ఆనందంగా ఉంది.
– శ్రీదేవి, దెందులూరు

ప్రభుత్వ ప్రోత్సాహం భేష్



మహిళలు స్వయం ఉపాధి, అద నపు ఆదాయం లక్ష్యంగా రుణా లు మంజూరు చేయడం అభినందనీయం. మంజూరు చేసిన యూనిట్ల ద్వారా కష్టపడి ప్రణాళికతో సమష్టిగా ఆదాయాన్ని పొందగలుగుతున్నాం.
– సునీత, చల్లపల్లి

సంఘాల ఆసక్తి



ఆసిల్ క్రాస్ నాటు కోళ్లు, కౌజు పిట్టలు పెంపకానికి స్వయం సహాయకసంఘాలు ఆసక్తి చూపుతున్నాయి. డ్వాక్రా, స్త్రీ నిధి నుంచి గ్రూపులకు జిల్లా అధికారుల అనుమతులతో నిధులు మంజూరు చేస్తున్నాం.
– వేణుగోపాల్, ఏపీఎం, దెందులూరు మండలం

ఆడపిల్లల పెంపకం భారం కాదు బాధ్యత


గణపవరంలో ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది


గోపన్నపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: ఆడ పిల్లలను పెంచడం భారంగా కాకుండా బాధ్యతగా భావించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయి అన్నారు. గురువారం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల సంరక్షణపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించండి, చదివించండి అని నినదించారు. ఆయా కార్యక్రమాల్లో సీహెచ్‌ఓ జె.విల్సన్, ఆరోగ్య సహాయకులు యోహాన్, నామాలరాజు, హెచ్‌ఎంలు కాంతిశ్రీ, రంగనాయకులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో

దెందులూరు: ఆడపిల్లలను చదివించడం, రక్షించడం తల్లిదండ్రుల బాధ్యతని గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి అన్నారు. గురువారం గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కె.రోజా లలిత ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి వ్యాయామ కళాశాల, గోపన్నపాలెం బస్టాండ్ మీదుగా హైస్కూల్ వరకు బేటీ బచావో.. బేటీ పడావో ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్లో హెచ్‌ఎం స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈఓ నాగరాజు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పాకపాడులో..


ఉంగుటూరు: ఆడపిల్లలను రక్షిచు.. చదివించు అని నినదిస్తూ భేటీ బచావో.. బేటి పడావో ర్యాలీ మండలంలోని ఉప్పాకపాడు గ్రామంలో విద్యార్థులు గురువారం నిర్వహించారు. ఏఎన్‌ఎం ప్రశాంతి, హెచ్‌ఎం అల్లు శ్రీను, ఉపాధ్యాయులు రాణి, ఆశ వర్కర్లు నిర్మల, మణి స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో మరిన్ని సేవలు


కొండలరావుపాలెం సచివాలయంలో తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : ప్రజలకు మరింత చేరువలో సేవల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం పెదవేగి మండలం అమ్మపాలెం సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిత్యం గ్రామస్థాయి స్పందన కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వర్వహించాలని, మండల, జిల్లా కార్యాలయాలకు ఫిర్యాదులు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం కొండలరావుపాలెంలో సచివాలయాన్ని ఆర్‌బీకేను ఎంపీడీఓ సందర్శించారు. ఆధార్ నమోదు, యాప్ ద్వారా తనిఖీ వివరాలను నమోదు చేశారు. ఇంటిపన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేటి నుంచి భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు


స్వయంభూ పార్వతీ సమేత భీమేశ్వరస్వామి

నిడమర్రు: పెదనింద్రకొలను స్వయంభూ పార్వతీ సమేత భీమేశ్వరస్వామి దివ్య కల్యాణ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఉద్దర్రాజు వీర్రాజు తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 9 గంటలకు మాజీ ఎంపీపీ కలిదిండి సోమరాజు, మధురాధిక దంపతులచే పార్వతీ సమేత భీమేశ్వరస్వామి వార్లను పెండ్లికుమారుడు, కుమార్తెను చేసి నూతన వస్త్రవులు సమర్పిస్తారని చెప్పారు. శనివారం తెల్లవారుజామున 4.26 గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణం ఉంటుందని, మధ్యాహ్నం రథోత్సవం, రాత్రికి సత్యా ర్కెస్ట్రా, 5న సన్నీ డ్యాన్స్ అకాడమీ నృత్య ప్రదర్శన, 6న తెప్పోత్సవం, స్వర సుధ ఆర్కెస్ట్రా, 7న పూర్ణాహుతి, పుష్పయాక శయనోత్సవం రాత్రికి బాలనాగమ్మ, సత్యహరిచంద్ర నాటకం, 8న జెమినీ ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ 9న నాని ఆర్కెస్ట్రా ఈవెంట్స్ సినీ మ్యూజికల్ నైట్, 10న 50 కిలోల లడ్డూ వేలంపాట అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జెడ్పీటీసీ కోడే కాశి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారని చెప్పారు.

అయ్యప్పల భిక్ష ప్రారంభం


భీమడోలులో అయ్యప్పల భిక్షను ప్రారంభిస్తున్న ఆలయ కమిటి చైర్మన్ శ్రీనివాసరాజు

భీమడోలు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పల భిక్షను ఆలయ చైర్మన్ దత్తాడ శ్రీనివాసరాజు గురువారం ప్రారంభించారు. భీమడోలులోని అయ్యప్ప స్వామి ఆలయంలో కేరళలో ఏప్రిల్ 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఉగాది ఉత్సవాలకు భీమడోలు, పరిసర గ్రామాలకు చెందిన 50 మంది మాలను ధరించడం ఆనయితీగా వస్తుంది. ఈ సందర్భంగా ఆలయం మాలధారుల స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. సూరప్పగూడెం మాజీ సర్పంచ్ వెజ్జు సూర్యకుమారి ఏడుకొండలరావు దంపతుల ఆర్థిక సాయంతో మాలధారులకు భిక్ష పెట్టారు. దత్తాడ శ్రీనివాసరాజు మాట్లాడుతూ మాలధారులకు ప్రతి రోజు భిక్ష పెట్టేందుకు దాతలు రావడం అభినందనీయమన్నారు. ఆ ఆలయంలో ఏటా వందలాది మంది మాలధారులు శబరిమాలై వెళ్లడం ఈ ప్రాంత ప్రజలు ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు గంధం భాస్కరరావు, వెంకట్రావు, పెద్దలు పసుపులేటి వెంకట్రావు, సవలం నాని, గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు, మాలధారులు పాల్గొన్నారు.

నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి


పోలసానిపల్లిలో నాడు నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ సాంబశివరావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు నేడు పథకం ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ డి.సాంబశివరావు అన్నారు. పోలసానిపల్లి నెం.1 ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్న భోజనం 46 మంది విద్యార్థుల్లో 45 మంది తినడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కూర, సాంబార్ మరింత రుచిగా తయారీ చేయాలని ఎండీఎం సిబ్బందికి సూచించారు. జగనన్న కానుక కిట్ల పంపిణీ వివరాలను హెచ్‌ఎం కె.తులసిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాడు – నేడు పథకంలో నిర్మిస్తోన్న అదనపు తరగతి గది పనులను ఆయన పరిశీలించారు. తొలుత విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను తరగతుల వారీగా పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచలందించారు. మండల పరిధిలోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి తొలి దశలో రూ.1.20 కోట్ల మంజూరు కాగా ఇప్పటికే 95 శాతానికి పైగా నిధులు వెచ్చించారని ఎంఈఓ చెప్పారు. చిన్నారుల విద్యా సామర్థ్యాలను పూర్తి స్థాయిలో పొందేలా టీచర్లు తగు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.తులసి, టీచర్ కె.నాగేశ్వరరావు, ఎండీఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


గోపీనాథపట్నం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: సంక్షేమ సారధి, పథకాల రారాజు సీఎం జగన్ అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కొనియాడారు. గురువారం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం, కై కరం గ్రామాల్లో 10 గ్రామ పంచాయతీలకు చెందిన గృహసారథులు, వలంటీర్ల చైతన్య సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ హామీలన్నింనీ సీఎం జగన్ నెరవేర్చారని, సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాని కోరారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తోన్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని వివరించారు. పథకాల పేరు చెబితే నాడు ఎన్టీఆర్, వైఎస్సార్, నేడు మన జగన్ మాత్రమేనని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పేదలకు గృహ నిర్మాణం వైఎస్సార్ ఘనతైతే.. చేయూత, ఆసరా, రైతు భరోసా వాహన మిత్ర, అమ్మఒడి, 3330 జబ్బులకు ఆరోగ్యశ్రీ, 25 లక్షల ఇళ్లు కట్టిస్తున్న ఘనత మన సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు తన హయాంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చిన దాఖలా లేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా సృష్టిస్తోన్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సభలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, పార్టీ సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, గోపినాథపట్నం సర్పంచ్ పుచ్చకాయల విష్ణుమూర్తి, పార్టీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఎస్సీసెల్ నాయకుడు గంటా లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి సేవలో వాసుబాబు

ఉంగుటూరు: మండలంలోని రాచూరు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత మాధవ స్వామి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇరు ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను వాసుబాబు దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు స్వాగతం పలికారు.

దండు మారెమ్మను దర్శించుకున్న భక్తులు

గణపవరం: గణపవరం ప్రజల ఇలవేల్పు దండు మారెమ్మవారి జాతర సందర్భంగా గురువారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వీరిలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, దండు రాము తదితరులు ఉన్నారు. ఉత్సవ కమిటీ తరఫున గణపవరం సొసైటీ చైర్మన్ కొనిశెట్టి రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట పెద్దింట్లమ్మ నూతన ఏక శిలా ధ్వజస్తంభ మహోత్సవం, ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, 36వ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 2 నుంచి 7 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధన, అంకురారోహణ చేసి అమ్మవారికి పెద్దింట్లమ్మ దేవీ అలంకరణ చేశారు.

నేడు పిప్పరలో గృహ సారథుల సమావేశం

గణపవరం: గణపవరం మండలం పిప్పరలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గృహ సారథులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. వీరికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దిశానిర్దేశం చేస్తారని, పిప్పర, కాశిపాడు, చిలకంపాడు, వాకపల్లి వీరేశ్వరపురం, వల్లూరు, ముగ్గళ్ల, ఎ.గోపవరం, కోమట్లపాలెం గ్రామాలకు చెందిన వారంతా హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామయ్య


పోతునూరులో అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు

భీమడోలు: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి రామయ్య అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ జీవీఎస్‌వీ రాఘవన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరించాలన్నారు. ఎంపీటీసీలు ముళ్లగిరి జాన్సన్, ఆజామ్, గంటా శ్రీనివాసరావులు పలు సమస్యలను లేవనెత్తారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉగాది నాటి ఎక్కువ గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2085 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని ఏఈ సీహెచ్ సతీష్ చెప్పారు. గృహ నిర్మాణాల్లో భీమడోలు మండలం జిల్లాలో నాలుగో స్థానంలో ఉందని ఎంపీడీఓ రాఘవన్ అన్నారు. బిల్లులు సకాలంలో రావడం లేదని ఎంపీటీసీ సభ్యులు చెప్పడంతో సాంకేతిక కారణాల రీత్యా బిల్లులు రాలేదని, ఈ నెలాఖరులోగా పరిష్కారం లభిస్తుందని ఏఈ సతీష్ వివరణ ఇచ్చారు. సమగ్ర మంచినీటి ప్రాజెక్ట్ నీరు కలుషితమవుతుంది సభ్యుడు జాన్సన్ చెప్పడంతో సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు జవాబిచ్చారు. చెట్టున్నపాడులో ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు అందించని ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్టు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో జూన్ నెలాఖరు నాటికి సమగ్ర భూ సర్వే పూర్తవుతుందని తహసీల్దార్ షంషాద్దీన్ చెప్పారు. అంబర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాలలో ఉన్న ఖాళీగా ఉన్న తరగతి గదుల్లోకి మార్చేలని ఎంపీటీసీ ఆజామ్ కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలి మజూనియర్, వైస్ ఎంపీపీ డోకల వాసంతి, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

దెందులూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం పోతునూరు గ్రామంలో ఆయుకట్టును ఆయన పరిశీలించారు. తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, డీఈ సత్యదేవ్, ఏఈ మాధవరావులతో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిధులకు ఇబ్బంది లేదని, విధుల్లో అలసత్వం వహించకుండా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణ విధిగా ఉంటుందన్నారు.

ఆలయంలో వైభవంగా మహా అన్నాభిషేకం


వసంతవాడ సుగ్రీవ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం

పెదపాడు : మండలంలోని చోళుల నాటి వసంతవాడ గంగాపార్వతీ సమేత సుగ్రీవ లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి వేదపండితులు జోస్యుల రామకృష్ణ శర్మ బృందం, వేద పండితులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. వసంతవాడ గ్రామంలో అభిషేకం చేయడం తొలిసారి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్నాన్ని వృథా చేయరాదని వేదపండితులు రామకృష్ణ శర్మ సూచించారు. 11 గంటల నుంచి మేడూరి సూర్యనారాయణ, పుసులూరి విశ్వప్రసాద్ దంపతులతో ఆయుత చండీ హోమం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి స్థానికులు మామిళ్ల వెంకటరమణ, మేడూరి సూర్యనారయణ దంపతులచే పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు చావలి లలితా అంబికేశ్వరశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిల్లంగోళ్ల రంగారావు సేవలు మరువలేనివి


రంగారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి కుటుంబీకులు

భీమడోలు: ఆర్థిక సంక్షోభంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మల్లవరం గ్రామ ప్రజలను ఆదుకున్న మహోన్నత వ్యక్తి దివంగత పిల్లంగోళ్ల రంగారావు అని వక్తలు కొనియాడారు. చెట్టున్నపాడు పంచాయతీ పరిధి మల్లవరంలో గ్రామస్తుల ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన ఏలూరు మునిసిపల్ మాజీ వైఎస్ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఆర్ఆర్ఆర్ సంస్థల అధినేత దివంగత పిల్లంగోళ్ల రంగారావు విగ్రహాన్ని గురువారం ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తల్లి గిరి కుమారి ఆవిష్కరించారు. క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లవరం గ్రామస్తులు మాట్లాడుతూ రామారావుకు తమ గ్రామానికి 50 ఏళ్ల అనుబంధం ఉందని, తమను అన్నివిధాలా ఆదుకున్నారని గుర్తుచేసుకున్నారు. పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ మల్లవరం ప్రజలు తన తండ్రి రంగారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. సంఘం ప్రతినిధులు ఈడ్పుగంటి నవరాజు, ఈడ్పుగంటి హరిభగవన్, ఉక్కునూరి రమేష్‌బాబు, ఉక్కునూరి గోపాలకృష్ణ, ఏట్రించి గణేష్, పిల్లంగోళ్ల శ్రీదేవి, వైదేహీపూర్ణ, సువర్చల పావని, గ్రామ పెద్దలు ఆదినారాయణ, బోయిన కేదార్, ఈశ్వరుడు, కొండలయ్య, చంటి రాజు, కల్యాణరాజు, రామరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.